క్లుప్తంగా

పేదలకు సాయం చేయాలి



అడ్డాకుల: గ్రామాల్లో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న వారు పేదలకు సాయం చేయడానికి ముందుకు రావాల్సిన అవసరముందని కాంట్రాక్టర్ గవిని చెన్నారెడ్డి అన్నారు. మండలంలోని రాచాల గ్రామంలో చెన్నకేశవస్వామి దేవాలయం వద్ద గురువారం ఆయన 255 మంది మహిళలకు చీరలు, 35 మంది పురుషులకు పంచెలను పంపిణీ చేశారు. పేదలు శుభకార్యాలు చేయడానికి రూ.3.40కోట్లతో గ్రామంలో ఫంక్షన్‌హాలు నిర్మించినట్లు చెప్పారు.

మైనార్టీ కోఆర్డినేటర్‌గా షా ఫైసల్



స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ మైనార్టీ విభాగం కోఆర్డినేటర్‌గా వీరన్నపేటకు చెందిన షా ఫైసల్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర చైర్మన్ షేక్ అబ్దుల్లా నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, జహీర్ అఖ్తర్, చంద్రకుమార్‌గౌడ్, ఖాజా అజ్మత్‌అలీ, మహ్మద్ అవేజ్, పీర్ సాధిక్, మూసా చావుష్, మెయిజ్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లూర్‌లో బోనాలు



నవాబుపేట: మండలంలోని కొల్లూర్‌లో గురువారం బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. భవనమ్మ దేవాలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మూడు రోజుల బోనాలలో శుక్రవారం బంగారు మైసమ్మ బోనాలు, శకటోత్సవం నిర్వహించనున్నారు.

ఇరు పార్టీల్లో చేరికల జోరు

నవాబుపేట: మండలంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో చేరికల జోరు కొనసాగుతుంది. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి, కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో గ్రామాధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ మండల బీసీ నాయకుడు బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. మండలంలోకి లోకిరేవుకు చెందిన సురేందర్‌గౌడ్ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే చెన్నారెడ్డిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నర్సింహులు పీసీసీ ప్రధానకార్యదర్శి అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పోమాల్‌లో పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరితే, కాకర్లపహడ్ చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

అధికార పార్టీలో విసుగుచెంది బయటికి..

రాజాపూర్: బీఆర్‌ఎస్ పార్టీపై విసుగుచెంది కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డిగూడ తన నివాసంలో మిడ్జిల్ మండలం రాణిపేట్, చిల్వేర్ నాయకులతో పాటు నవాబుపేట మండలం చెన్నారెడ్డిపల్లి, బాలానగర్ మండలం పెద్దరేవల్లికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయదని ప్రజలకు అర్థమైందన్నారు.

బహిరంగసభ ఏర్పాట్ల పరిశీలన



హన్వాడ: మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, మండల అధ్యక్షుడు కృష్ణయ్యయాదవ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఓ వ్యవసాయ పొలంలో సభ నిర్వహణకు సంబంధించి పనులను పర్యవేక్షించారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించేందుకు ఏర్పాటు చేస్తున్న బహిరంగసభకు కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.



నవాబుపేట మైసమ్మ దేవాలయంలో మహాలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు



లక్ష్మీపల్లిలో బాలత్రిపురసుందరి అలంకారంలో..



జడ్చర్లలో లలితాదేవిగా..



భూత్పూర్‌లో మహాలక్ష్మి అవతారంలో..

ఆకట్టుకున్న అమ్మవారి అలంకరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం పాలమూరు పట్టణంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని పలు ఆలయాల్లోని అమ్మవారి విగ్రహాలను వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. గురువారం బ్రాహ్మణవాడిలోగల వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో మహాలక్ష్మిదేవి అలంకరణలో అలంకరించారు. ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారి పల్లకీసేవ నిర్వహించారు. వీరన్నపేటలోని చౌడేశ్వరి దేవాలయం, ద్వారకామాయి బాబా మందిరం, గణేష్‌నగర్‌లో షిరిడీసాయిబాబ మందిరాల్లో భక్తిశ్రద్ధలతో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. రేణుక ఎల్లమ్మ, శ్రీనివాసకాలనీలోగల పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయాల్లో, లక్ష్మీనగర్‌కాలనీలోని శ్రీరాజరాజేశ్వరి మందిరంలో అమ్మవారికి పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

కొనసాగుతున్న ఉత్సవాలు..

గండేడ్: వెన్నాచేడ్, కొండారెడ్డిపల్లి, సల్కర్‌పేట్, రుసుంపల్లి, పగిడ్యాల్, మన్సూర్‌పల్లి గ్రామాల్లో దుర్గమాతలకు పూజలు చేస్తున్నారు. వెన్నాచేడ్‌లోని దత్తపీఠంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గురువారం లలితాంబిక అవతారంలో తండావాసులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ దేవాలయంలో అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో అలంకరించారు. మహిళలు కుంకుమార్చన చేసి పూజలలో పాల్గొని నైవేద్యాలు సమర్పించారు. కన్యాకాపరమేశ్వరి దేవాలయం, జైగణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవార్ల అలంకరణ ఆకట్టుకుంది.

మహాచండీ రూపంలో దుర్గామాతకు పూజలు

దేవరకద్ర: పట్టణంలోని పోచమ్మ దేవాలయం వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారిని గురువారం మహాచండీ రూపంలో అలంకారం చేసి ఘనంగా పూజలు నిర్వహించారు.

లలితాదేవి అవతారంలో..

వాసవీమాతను గురువారం లలితాదేవి రూపంలో అలంకరించి పూజలు నిర్వహించారు. పలువురు మహిళలు అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి పారాయణం చేశారు. ఈ సందర్భంగా పల్లకిసేవ నిర్వహించారు. దళితవాడలో వెలసిన దుర్గామాతను మహాచండీదేవిగా అలంకారం చేసి పూజలు చేశారు.

బాల త్రిపురసుందరిగా కనకదుర్గాదేవి..

లక్ష్మీపల్లిలో వెలసిన కనకదుర్గాదేవి అమ్మవారిని గురువారం బాల త్రిపురా సుందరిగా ప్రత్యేక అలంకారం చేసి ఘనంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు దేవాలయ ప్రాంగణంలో మహిళలు పూలబతుకమ్మలతో కోలాట ప్రదర్శన, బొడ్డెమ్మలు వేశారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఆయా ఉత్సవ మంటపాల్లో అమ్మవారు లలితాదేవి, మహాచండీ, అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, సాయినగర్ సకలదేవతల ఆలయంలో లలితాదేవిగా అమ్మవారిని పూజించారు. శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో అన్నపూర్ణదేవిగా, గౌరిశంకర్‌కాలనీ, చైతన్యనగర్ బంగారుమైసమ్మ దేవాలయంలో మహాచండీగా అలంకరించారు. అమ్మవారి ఉత్సవాలు పురస్కరించుకుని బతుకమ్మ సంబరాలు కొనసాగుతున్నాయి.



దేవరకద్రలో మహాచండీదేవిగా..



జిల్లా కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరి మందిరంలో కుంకుమార్చన

మహాలక్ష్మి అవతారంలో..

భూత్పూర్: దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాదేవి అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. మున్సిపాలిటీతో పాటు అమిస్తాపూర్ సాక్షి గణపతి ఆలయంలో ఐదు రోజులుగా దుర్గాదేవి వివిధ రూపాలల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాలయానికి వచ్చే భక్తుల కోసం ప్రతిరోజు అన్నదానం నిర్వహిస్తున్నారు.



వెన్నాచేడ్‌లో గర్బ ఆడుతున్న యువతులు, మహిళలు

మీరు చేసిన అభివృద్ధి ప్రజలకు అర్థమైంది

● మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్



మాట్లాడుతున్న చిత్తరంజన్‌దాస్

జడ్చర్ల టౌన్: ప్రజా ఆశీర్వాద సభ పేరుతో బుధవారం బీఆర్‌ఎస్ నిర్వహించిన సభ విఫలమైందని, ఎమ్మెల్యే ప్రసంగిస్తుండగానే ప్రజలు వెళ్లిపోయారంటే మీరు చేసిన అభివృద్ధి ఏపాటిదో అర్థమవుతుందని మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు చిత్తరంజన్‌దాస్ విమర్శించారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో సమస్యలు అనేకం ఉన్నాయని వాటిని సీఎం దృష్టికి తీసుకువెళ్లటంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి విఫలమయ్యారన్నారు. సీఎం వస్తే నియోజకవర్గానికి రూ.వందల కోట్ల నిధులు కోరాల్సిందిపోయి కేవలం ట్రాఫిక్, రూరల్ పోలీస్‌స్టేషన్లు కోరటం ఏమిటని ప్రశ్నించారు. బైపాస్ అడిగితే దాన్ని చెప్పకుండానే సీఎం వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. పట్టణంలో ఎక్కడా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ లేదని, రోడ్ల సమస్యలు అలాగే ఉన్నాయని, చివరకు రెవెన్యూ డివిజన్‌ను సైతం అడగలేకపోయారన్నారు. పదేళ్ల కాలం చాలం విలువైనదని, దానిని వృథా చేశారన్నారు. అంతా బాగుందని సీఎం ముందు చెబితే ఆయన నిధులు ఎందుకు ఇస్తారని ప్రశ్నించారు. నిన్నటి వరకు ఉదండాపూర్ ముంపు గ్రామాల ప్రజలకు పరిహారం ఇస్తామని, ఇప్పుడేమో ఎన్నికలు వచ్చాయని సాకుగా చెబుతున్నారని అన్నారు. ఇక్కడ కనీసం ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాల కొత్తగా వచ్చిందా అని ప్రశ్నించారు. కృష్ణయ్య, నాగరాజు, రాజు, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి పునఃప్రతిష్ట

బాలానగర్: మండలంలోని పెద్దాయపల్లిలో బొడ్రాయి పునః ప్రతిష్ట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో యజ్ఞయాగాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామ ఆడపడుచులతో బిందెలతో బొడ్రాయికి అభిషేకం చేశారు.

గడప గడపకు బీఆర్‌ఎస్ ప్రచారం



దేవరకద్రలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



రాందాస్‌తండాలో ప్రచారం చేస్తున్న ఆల మంజుల

దేవరకద్ర: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో గురువారం బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేశారు. నియోజకవర్గ కేంద్రంలో గడప గడపకు బీఆర్‌ఎస్ పార్టీ పేరుతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి కేసీఆర్ ప్రకటించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, శివానంద్, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేష్, బాల్‌రాజు, భాస్కర్‌రెడ్డి, రాము, యుగంధర్‌రెడ్డి, చల్మారెడ్డి, వెంకట్రాములు, నరేష్, జగన్ పాల్గొన్నారు.

కౌకుంట్లలో..

కౌకుంట్ల మండల కేంద్రంలో ఎంపీటీసీ కిష్టన్న, శ్రీకాంత్, తుమ్మలశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. పెద్దగోప్లాపూర్, బల్సుపల్లి, నాగారంలో బీఆర్‌ఎస్ ప్రచారం చేపట్టారు.

బీఆర్‌ఎస్ పార్టీతోనే సంక్షేమ ఫలాలు..

భూత్పూర్: బీఆర్‌ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్‌తోనే సంక్షేమ ఫలాలు సాధ్యమౌతాయని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి ఆల మంజుల అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని పిల్లిగుండు, వశురాంతండా, నల్లగుట్ట తండా, రాందాస్ తండాల్లో ఎన్నికల ప్రచారంలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల గురించి వివరించారు. సీఎం కేసీఆర్ మేనిఫెస్టోలో లేని పథకాలను సైతం ప్రజలకు అందించారని, ఈ సారి పథకాలన్నింటినీ అమలు చేస్తారన్నారు. మరో సారి కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని, కేసీఆర్‌ను మరోసారి సీఎం చేద్దామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, నారాయణ గౌడ్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండంలోని గోప్యానాయక్ తండాలో గురువారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోట రాము ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిపక్షంలో ఉండేందుకు ఇష్టంలేకే..

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రతిపక్ష పార్టీల్లో ఉండేందుకు నాయకులకు మనసు ఒప్పడంలేదని అందుకే బీఆర్‌ఎస్‌లోకి క్యూ కడుతున్నారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక మంత్రి ఫాంహౌస్‌లో టీడీగుట్టకు చెందిన ముదిరాజ్ సంఘం, ఇతర నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్‌ఎస్ సర్కారు ఊహించని విధంగా అభివృద్ధి పనులు చేపడుతుంటే ప్రతిపక్ష పార్టీల్లో కేడర్ ఉండేందుకు ఇష్టపడటం లేదని అందుకే ఆ పార్టీలు ఖాళీ అవుతున్నాయని తెలిపారు. హామీ ఇచ్చినవి, ఇవ్వనివి కూడా అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రస్తుతం సీఎం తీసుకువచ్చిన మేనిఫెస్టోపై ప్రజలు అత్యంత విశ్వాసంతో ఉన్నారన్నారు. ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ మహబూబ్‌నగర్ వచ్చిన గుంటూరుకు చెందిన 70 కుటుంబాల సభ్యులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు చిరునామా అయిన ఈ ప్రాంతాన్ని నమ్ముకుని వచ్చిన వారికి అండగా నిలుస్తామని మంత్రి పేర్కొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కోడూరుకు చెందిన నాయకులు

మంత్రికే మాలల సంపూర్ణ మద్దతు

మహబూబ్‌నగర్ రూరల్: మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కే మాలల సంపూర్ణ మద్దతు ఉంటుందని మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటస్వామి అన్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు సుమారు 70 మంది మాల మహానాడు నాయకులకు మంత్రి పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ ఎన్నికల్లో లక్ష ఓట్ల పైచిలుకు మెజారిటీతో గెలిపించేందుకు తాము కృషి చేస్తామని అన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో మోసం

స్టేషన్ మహబూబ్‌నగర్: పదేళ్ల నుంచి రాష్ట్రంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కుర్హినిశెట్టికాలనీ 28వ వార్డులో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన 34 లక్షల ఇందిరమ్మ ఇళ్లతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. మెయిన్‌రోడ్ల అభివృద్ధి అంటూ నిధులను దుబారా చేశారన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీకి విశేష ఆదరణ లభిస్తుందని తెలిపారు. తెలంగాణలో అధికారంలోకి రాగానే సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను కచ్చితంగా అమలుచేసి తీరుతామని అన్నారు. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో చంద్రకుమార్‌గౌడ్, బెనహర్, వసంత, సిరాజ్‌ఖాద్రీ, సాయిబాబా, లక్ష్మణ్ యాదవ్, రాఘవేందర్ రాజు, అజ్మత్‌అలీ, కిషన్‌నాయక్, ఖాదర్, ఫహీం, నాగరాజు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): డీఆర్‌డీఓ కార్యాలయంలో నడుస్తున్న అద్దె వాహనాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వెహికిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ కోరారు. డీఆర్‌డీఓ యాదయ్యకు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఏడు వాహనాలకు చెందిన వారు బిల్లులు రాకపోవడంతో దసరా పండుగ చేసుకోలేకపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన డీఆర్‌డీఓ ఫైనాన్స్ డీపీఎం దామోదర్‌కు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు.



రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

అడ్డాకుల: ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రానుందని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండల కేంద్రంలో గురువారం చక్రాపూర్, తుంకినీపూర్, వేముల, గాజులపేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. రెండు సార్లు అధికారం ఇస్తే దోచుకుని, దాచుకోవడానికే నేతలు పని చేశారని విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోని అధికార పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రెడ్డి ఇసుక, ఒండ్రు మట్టిని అమ్ముకుని రూ.కోట్లను కూడబెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో అరవింద్‌కుమార్ రెడ్డి, నాగిరెడ్డి, శెట్టిశేఖర్, సంతోషి, గోవర్ధన్, సురేష్, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య, విజయకుమార్, రాంచందర్, రవి, సంపత్ తదితరులు ఉన్నారు.

ఇంటింటి ప్రచారం..

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, ఆంజనేయులు, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జయన్న, ప్రభు, రవీందర్‌రెడ్డి, కొండన్న, సురేంద్రచారి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మూసాపేటలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం

భూత్పూర్: బడుగు, బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ కృషి చేస్తుందని కవిత అన్నారు. మండలంలోని మద్దిగట్లలో గురువారం గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. కర్ణాటక తరహాలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, కళ్యాణలక్ష్మి తరహా తులం బంగారంతో పాటు రూ.లక్ష అందిస్తారన్నారు. రూ.500కే గ్యాస్, మహిళకు రూ.4వేల పింఛన్‌లతో పాటు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అన్ని పథకాలు కొనసాగిస్తామని తెలిపారు.

ప్రజలను ఎక్కువకాలం మభ్యపెట్టలేరు



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

జడ్చర్ల టౌన్: నియోజకవర్గ ప్రజలను ఎక్కువ కాలం మభ్యపెట్టలేరని బీఆర్‌ఎస్ నిర్వహించిన సభ ద్వారా నిరూపితమైందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శివకుమార్ ఆరోపించారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా ఆశీర్వాద సభ పేరుతో నిర్వహించిన బీఆర్‌ఎస్ సభ పూర్తిగా విఫలమైందని, ఎమ్మెల్యే నియోజకవర్గం సస్యశ్యామలం అయ్యిందని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే ప్రజలు వెళ్లిపోవటం వారిని మభ్యపెట్టలేరని తెలిపిపోయిందన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉండి చేసిందేమి లేదని, అనేక సమస్యలు ఉండగా వాటిని సీఎం దృష్టికి తీసుకువెళ్లకుండా ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలను మోసం చేశారన్నారు. ఉపాధి, మౌలిక సదుపాయాలు, రెవెన్యూ డివిజన్ గురించి ప్రస్తావించకుండా మళ్లీ అవకాశం ఇవ్వాలని అడగడం సిగ్గుచేటన్నారు. బీఎస్పీ మేనిఫెస్టో అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం రూపొందించామని, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజల నుంచి తగిన గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో శ్రీను, పురుషోత్తం, నర్సింహులు, హరీష్ కుమార్, భాను, రాజేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'అధికారంలో ఉండి ఒరగబెట్టిందేమీ లేదు'

జడ్చర్ల: మూడు సార్లు ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన లక్ష్మారెడ్డి స్థానికంగా చేసిన అభివృద్ధి ఏమీ లేదని టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ వచ్చిన సందర్భంగాలో స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కోరిన కోరికలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. రూరల్ పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లు కావాలని ఏకంగా సీఎంను కోరడం విడ్డూరంగా ఉందన్నారు. డీజీపీ సహకారంతో వాటిని ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఇక బైపాస్ రోడ్డు ఇన్నాళ్లకు గుర్తు రావడం విచారకరమని, తాను కొనుగోలు చేసిన భూములు ఏమైనా బైపాస్ వచ్చే రోడ్డు చుట్టూ ఉన్నాయా ఏమి అని ప్రశ్నించారు. వాస్తవంగా రెవెన్యూ డివిజన్, పోలీస్ సబ్‌డివిజన్ అవసరమన్నారు. అదేవిధంగా ఉదండాపూర్ నిర్వాసితుల సమస్యలపై తాము పోరాటాలు చేశామని, నాడు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కలెక్టర్ రోనాల్డ్‌రోస్‌లు నిర్వాసితుల సమస్యలు తీరుస్తామని చెప్పి మూడేళ్లు గడిచినా ఇప్పటి వరకు తీర్చలేదన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ తరహాలో పరిహారం రూ.20లక్షల వరకు పెంచి భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని, డ్రై పోర్టు కావాలని సీఎంను కోరాల్సి ఉండగా ఎలాగు ఇచ్చే ఆర్‌అండ్‌ఆర్ అమలు చేయాలని కోరడం ఏమిటని ప్రశ్నించారు. నాడు సకాలంలో ఇచ్చే పరిహారాన్ని ఇచ్చి ఉంటే కొంతమేరకైనా నిర్వాసితులకు న్యాయం జరిగేదన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో ఏర్పాటు చేసిన పోలేపల్లి సెజ్‌ను తాను తెచ్చినట్లు పదే పదే చెప్పడం తగదన్నారు. నిజంగా ఆయనకు స్థానికులపై ప్రేమ ఉంటే సెజ్‌లో స్థానిక యువతకు ఎందుకు ఉపాధి కల్పించడం లేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక జీఓ తీసుకువచ్చి 70 శాతం స్థానికులకే ఉపాధి కల్పిస్తామన్నారు. మంత్రి కేటీఆర్ ప్రారంభించిన డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పటి వరకు ఎందుకు లబ్ధిదారులకు కేటాయించలేదన్నారు. వంద పడకల ఆస్పత్రికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేదన్నారు. సమావేశంలో నర్సింహయాదవ్, కృష్ణయ్య, నర్సింహ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిరుధ్‌రెడ్డి

నెక్కొండలో చేరికలు..

మండలంలోని నెక్కొండలో మాజీ సర్పంచ్ యోగీశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కండువాలు వేసి అనిరుధ్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.